సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 5 । జనవరి । 2025



దాతల హాజరు సాధ్యమేనా?

రథ సప్తమికి డోనర్ పాసులపై అయోమయం నెలకొంది. క్యూఆర్ కోడ్ పెట్టనున్నారు. - 8లో



స్కీమ్ స్కామ్ చేయనున్నారు

ఆరోగ్య శ్రీలో మార్పులపై మాజీ మంత్రి సీదిరి మండిపడ్డారు. మార్పుల పేరుతో స్కామ్ చేయబోతున్నారని ఆరోపించారు. - 8లో

శ్రీకాకుళంకు కొత్త లోగో

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ నూతన లోగోను రూపొందిస్తున్నామని, ఆసక్తి గల వారు కొత్త లోగోను తయారుచేసి తమకు ఇవ్వగలరని కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాద్ కోరారు. నూతన లోగోలో శ్రీకాకుళం సంస్కృతి, సంప్రదాయం కనిపించేలా రూపొందించి ఈ నెల 18వ తేదిలోపు మెయిల్ ఐడి కమీషనర్‌ఎస్‌కెఎల్‌ఎమ్@యాహూ.కో.ఇన్ కు పంపించాలని కోరారు.

మేలుకొలుపు విని..



పాత శ్రీకాకుళం వేంకటేశ్వర భజన మండలి ఆధ్వర్యంలో...



గార: శ్రీకూర్మంలో మహిళల నగర సంకీర్తన



బలగలో మేలుకొలుపు బృందం

శ్రీకాకుళం కల్చరల్,గార: సుప్రభాతపు పరిమళాలు వీధివీధినా వెదజల్లాలి. స్వామి కీర్తనల మధురిమలు ఊరంతా వినిపించాలి. ధనుర్మాసపు వేకువలన్నీ సుస్వర భరితమై విరాజిల్లాలి. ఇవన్నీ జరగాలంటే మేలుకొలుపు ఒకటి వినిపించాలి. ఆ కొలుపుతోనూ ఊరు నిద్ర లేవాలి. ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఈ సత్సంప్రదాయం ఇప్పుడు కూడా కొనసాగుతోంది. జిల్లా కేంద్రంలో అయితే దాదాపు 15 వరకు భజన బృందాలు ఉన్నాయి. ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు వీధుల్లో, గ్రామాల్లో తెల్లవారు జామునే కీర్తనలు ఆలపిస్తూ తిరుగుతూ భక్తులు ఇచ్చే బియ్యం, వస్తువులు, డబ్బులను స్వీకరిస్తారు. వాటిని ఒక రోజున ఉచితంగా అన్నప్రసాద వితరణ, మిగిలిన దానితో సంబంధిత ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నారు. బలగ హరేరామమందిరం ఆధ్వర్యంలో యాభై ఏళ్లుగా మేలుకొలుపులు పాడుతున్నారు. భీమేశ్వర భజన మండలి వారు 27 ఏళ్లుగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం కేంద్రంగా 13 ఏళ్లుగా మేలు కొలుపు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. శ్రీకూర్మంలోనూ మూడు దశాబ్దాలుగా క్రతువు జరుగుతోంది. భక్తులు సమర్పించిన బియ్యం, పప్పు దినుసులు డబ్బులతో భీష్మ ఏకాదశి నాడు అన్నప్రసాదం అందిస్తారు.

కొత్తూరు అల్లు వీధిలో దర్శనమిచ్చిన గంగిరెద్దులు






బసవన్న రాక

పల్లెకు సంక్రాంతి కళ వచ్చేసింది. డూడూ బసవన్నల ఆట అక్కడక్కడా కనిపిస్తోంది. కొత్తూరు, పారాపురం, కర్లెమ్మలతో పాటు పలు గ్రామాల్లో గంగిరెద్దుల ఆట కనిపిస్తోంది. - కొత్తూరు

అన్నీ కల్లబిల్లు కబుర్లేనా..!

- అదను చూసి దెబ్బకొట్టిన చంద్రబాబు
- తక్కువ వినియోగం జరిగే శీతాకాలంలో విద్యుత్ చార్జీల బాదుడు
- వినియోగం తగ్గడం వల్ల బిల్లు పెద్దగా రాదని వ్యూహాత్మకంగా వ్యవహరించిన కూటమి సర్కారు
- జనవరి నెలలోనే కనిపించిన బాదుడు ప్రభావం
- వేసవి వస్తే భారీ మోత తప్పదు





శ్రీకాకుళం నగరంలోని ఓ వినియోగదారుడికి 2024 అక్టోబర్ 2 నుంచి 2024 నవంబర్ 2వ తేదీ వరకు వచ్చిన విద్యుత్ బిల్లు ఇది. ఈ నెలలో 145 యూనిట్లు వినియోగిస్తే రూ.675.42 వచ్చింది.

ఇదే వినియోగదారుడికి 2024 డిసెంబర్ 2 నుంచి 2025 జనవరి 3వ తేదీవరకు వచ్చిన విద్యుత్ బిల్లు ఇది. ఈ నెలలో 123 యూనిట్లు వినియోగిస్తే రూ. 686.80 వచ్చింది.

సాధారణంగా యూనిట్ల వినియోగం తగ్గితే బిల్లు తక్కువ రావాలి. దాదాపు 22 యూనిట్లు వినియోగం తగ్గినప్పటికీ గత బిల్లు కన్నా ఎక్కువ వచ్చింది.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

చంద్రబాబు అదును చూసి దెబ్బ కొట్టారు. శీతాకాలం విద్యుత్‌బిల్లులు పెద్దగా గమనించబోరన్న ఆలోచనతో మెల్లగా చార్జీలు పెంచేశారు. ఎఫ్‌పీపీసీఏ చార్జీలు, పెంచిన టారిఫ్‌లు చూస్తే చంద్రబాబు మాయాజాలం ఏంటో అర్థమవుతుంది. సాధారణంగా చలికాలంలో సహజంగా వినియోగం తగ్గడం వలన బిల్లు తగ్గుతుంది. ఇదే సమయంలో బిల్లు పెంచితే వినియోగదారుడు పట్టించుకోడన్న తెలివిని సర్కారు చూపించింది.

చంద్రబాబు సహజ మోసం

విద్యుత్ చార్జీల భారం వేయం..వేయం...అని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వ్యూహాత్మకంగా విద్యుత్ చార్జీల భారం మోపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి ఇప్పటివరకు అంటే కేవలం ఆరు నెలల్లోపు రెండు సార్లు విద్యుత్ చార్జీలను పెంచేసింది. జిల్లాలో శ్రీకాకుళం, పలాస, టెక్కలి డివిజన్ల పరిధిలో మొత్తం 7,88,078 విద్యుత్ కనెక్షన్లున్నాయి. వీటిలో హెచ్‌టీ వినియోగదారులు కేవలం 477 మాత్రమే ఉండగా మిగిలినవారంతా ఎల్‌టీ వినియోగదారులే... చంద్రబాబు వీరందరికీ షాక్ ఇచ్చారు. వీరందరిపైనా సంవత్సరానికి సుమారు రూ.200కోట్ల వరకు అదనపు భారాన్ని మోపారు.



సారవకోటకు చెందిన వినియోగదారుడికి 2024 సెప్టెంబర్ 5 నుంచి అక్టోబర్ 3వ తేదీవరకు వరకు వచ్చిన విద్యుత్ బిల్లు ఇది. ఈ నెలలో 113 యూనిట్లు వినియోగిస్తే రూ. 473.37వచ్చింది.

ఇదే వినియోగదారుడికి 2024 డిసెంబర్ 6 నుంచి 2025 జనవరి 3వ తేదీవరకు వచ్చిన విద్యుత్ బిల్లు ఇది. ఈ నెలలో కేవలం 55యూనిట్లు వినియోగిస్తే బిల్లు రూ. 340.93వచ్చింది.

వాస్తవంగా గత బిల్లు కంటే ఈ బిల్లులో దాదాపు 58 యూనిట్ల తక్కువ వినియోగం జరిగింది. ఈ లెక్కన బిల్లు సగానికి పైగా తగ్గాలి. కానీ అంత తగ్గలేదు.




ఈ రెండు బిల్లుల్లో ఉన్న విద్యుత్ టారిఫ్ ఒకసారి చూడండి. 2024 అక్టోబర్ వరకు 30 యూనిట్ల వరకు యూనిట్‌కి రూ. 1.90 ఉండేది. 2025 జనవరికి వచ్చేసరికి అదే 30 యూనిట్ల వరకు యూనిట్ విలువ రూ.3.33అయింది. అలాగే, 31 యూనిట్ల నుంచి 75 యూనిట్ల వరకు యూనిట్ విలువ రూ. 3.00 ఉండేది. ఇప్పుడా 31యూనిట్ల నుంచి 75 యూనిట్ల వరకు యూనిట్ విలువ రూ. 4.00అయింది.

ఈ లెక్కన చూసుకుంటే 30యూనిట్ల వరకు రూ. 3.33, 75యూనిట్ల వరకు 4.00 లెక్కిస్తారు. దీన్నిబట్టి యూనిట్ల వినియోగం పెరిగే కొద్దీ యూనిట్ విలువ పెరిగిపోతోంది. అంటే, శీతాకాలంలో వినియోగం తక్కువగా ఉండటం వలన అంతగా భారం కనిపించదు. వేసవి వస్తే వినియోగం పెరిగితే పెరిగిన యూనిట్ చార్జీ ఎంత ఎఫెక్ట్ చూపిస్తుందో స్పష్టమవుతుంది.



టెక్కలిలోని ఎన్టీఆర్ కాలనీలో నివసిస్తున్న ఓ వినియోగదారుడి బిల్లు ఇది. 2024 అక్టోబర్ 6వ తేదీ నుంచి నవంబర్ 3వ వరకు వచ్చిన విద్యుత్ బిల్లులో ట్రూ అప్ చార్జీల కింద ఎఫ్‌పీపీసీఏ చార్జీ–2 కింద రూ. 82 ఉంది.



ఇదే వినియోగదారుడికి సంబంధించి డిసెంబర్ 4 నుంచి 2025జనవరి 4వ తేదీ వరకు వచ్చిన బిల్లు ఇది. ఈ బిల్లులో ట్రూ అప్ చార్జీల కింద ఏఫ్‌పీపీసీఏ(పాస్ త్రూ అఫ్ ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ ఎడ్జస్ట్‌మెంట్) చార్జీ కింద రూ.80.40, ఎఫ్‌పీపీసీఏ- 2 చార్జీ కింద రూ. 66.40, ఎఫ్‌పీపీసీఏ 3 ఛార్జీ కింద రూ. 48.41 ఉంది.

ఈ రెండు బిల్లులను పరిశీలిస్తే మొదటి బిల్లులో ట్రూ అప్ చార్జీల కింద ఎఫ్‌పీపీసీఏ–కింద మాత్రమే చార్జీ ఉండగా, రెండో బిల్లులో ట్రూ అప్ చార్జీల కింద ఎఫ్‌పీపీసీఏ కింద రూ. 80.40, ఎఫ్‌పీపీసీఏ 2 చార్జీ కింద రూ. 66.40, ఎఫ్‌పీపీసీఏ 3 చార్జీ కింద రూ. 48.41 బిల్లు పడింది. గత బిల్లులో కంటే అదనంగా ఎఫ్‌పీపీసీఏ కింద రెండు సార్లు చంద్రబాబు సర్కార్ వడ్డించింది.

పక్కా ప్రణాళిక అవసరం

టెక్కలి: రానున్న పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు పక్కా ప్రణాళికతో సన్నద్ధం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.తిరుమలచైతన్య అన్నారు. శనివారం టెక్కలి మండలం చాకిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలతో పాటు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులతో వివిధ రకాల కథలను రాయించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆయనతో పాటు ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్, డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ భారతి, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పి.జగదీశ్వరరావు, ఉపాధ్యాయులు కె.నారాయణరావు, పి.చిన్నారావు, బి.ఆనందరావు, ఆర్.జ్యోతి, కె.సుధారాణి, సిహెచ్.భారతి, తదితరులు ఉన్నారు.

మహా మాయగాడెక్కడ?



ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఓ పోలీస్ స్టేషన్ నుంచి గత నెల 31వ తేదీన తప్పించుకున్న పాత నేరస్తుడు, జిల్లాలో పలు చోరీలతో సంబంధం ఉన్న పున్నాన రాంబాబు ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. తప్పించుకొని ఐదు రోజులు అవుతున్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లే అవకాశం ఉందన్న కోణంలో అన్వేషిస్తున్నారు. పదుల సంఖ్యలో దొంగతనాల కేసుల్లో ఇతను నిందితుడు. ఇతడిని పట్టుకుంటేనే చాలా కేసులకు ముగింపు లభిస్తుంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఈ వ్యక్తి నివాస ప్రాంతంలోని కుటుంబ సభ్యులు ఇళ్లు, ప్రేయసి ఇళ్లను సైతం పరిశీలించారు.

ఫోన్ వాడడు..

ఈ నేరస్తుడు నటనలో, సాంకేతిక పరిజ్ఞానంలో మంచి నైపుణ్యం ఉన్న వ్యక్తిగా సమాచారం. ముందుగా విజయవాడ చేరడం, అక్కడి నుంచి నచ్చిన ప్రాంతం ఎంచుకోవటం గతంతో చేసేవాడు. పాలిటెక్నిక్ డిప్లమా చేసిన రాంబాబుకు టెక్నాలజీపై మంచి పట్టు ఉంది. ఇతను ఫోన్ వాడడు. ఫోన్ వాడితే లైవ్ లోకేషన్ పరంగా దొరికే అవకాశం ఉంది. మరో పక్క కొన్ని రాష్ట్రాల్లో క్లబ్ క్రికెటర్లు, బెట్టింగ్ గ్రూపులతో సంబంధం ఉంది. తనకు కావాల్సిన వారితో మరొకరి ఫోన్ ద్వారా మాట్లాడతాడు. దొంగతనాలు చేసేటప్పుడు సైతం బైక్‌లపై తిరిగి తాళాలు వేసి ఉన్న ఇళ్లు లక్ష్యంగా చోరీలు చేస్తాడు. పదుల సంఖ్యలో చోరీలతో సంబంధం ఉన్న ఈ వ్యక్తిని పోలీసులు అతి కష్టం మీద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణ చివరి దశకు చేరిన సమయంలో స్టేషన్ నుంచి తప్పించుకోవటం పోలీస్ వర్గాలకు సైతం మింగుడు పడటం లేదు.

- పరారైన నేరస్తుడి కోసం గాలింపు

క్లుప్తంగా

గురుకులాల్లో పార్ట్‌టైం ఉద్యోగాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో తామరాపల్లిలోని డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల కళాశాల (బాలికలు)లో ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్‌వైజర్/ స్టాఫ్‌నర్సు పోస్టుల్లో పార్ట్ టైం ప్రాతిపదికన పనిచేసేందుకు మహిళా అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కో–ఆర్డినేటర్ ఎస్.బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్/ జీఎన్ఎం శిక్షణ పొందిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో శ్రీకాకుళంలోని ఆదివారంపేట వద్ద ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయాధికారి కార్యాలయంలో ఈ నెల 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 08942-279926, 9701736862, 9000314209 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పశువుల అక్రమ రవాణాపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురం బైపాస్ కూడలి సమీపంలో జాతీయ రహదారిపై శ్రీకాకుళం వైపు వెళుతున్న పశువుల అక్రమ రవాణా వాహనాన్ని శుక్రవారం రాత్రి ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వి.సందీప్‌కుమార్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసునమోదు చేశారు. ఎనిమిది ఆవులు, నాలుగు దూడలను విశాఖలోని కొత్తవలస గోశాలకు తరలించారు. జాతీయ రహదారిపై పశువుల అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఎస్సై తెలిపారు.

జిల్లా రైతులకు పురస్కారాలు


పురస్కారం అందుకుంటున్న రైతు చిరంజీవి

ఆమదాలవలస/సంతబొమ్మాళి: నిమ్మతొర్లాడ గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయం రైతు నక్క చిరంజీవికి ఉత్తమ ప్రకృతి వ్యవసాయ అభ్యుదయ రైతునేస్తం పురస్కారం లభించింది. శనివారం గుంటూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో భాగంగా మంత్రి అచ్చెన్నాయుడు చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు దంపతులు తంగి రమణమూర్తి, విజయలను కూడా సత్కరించారు.

జాతీయ క్రికెట్ పోటీలకు బొడ్డపాడు విద్యార్థి


సాహిల్‌కుమార్‌యాదవ్

పలాస: మండలంలోని బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రాపాక సాహిల్ కుమార్ యాదవ్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. త్వరలో ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొంటాడని పాఠశాల పీడీ సీహెచ్ రామ్‌జీ శనివారం తెలిపారు. పాఠశాల క్రీడా సమాఖ్య తరఫున మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషాష, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సాహిల్ తల్లిదండ్రులు రాపాక జగదీష్, రమణమ్మలు, ఎస్.ఎం.సి చైర్మన్ గర్తం తులసీరావు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఓ కార్యాలయం ఆరా


వరి కుప్పలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

నరసన్నపేట: ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో వేసిన వరి కుప్పలు తడిచిపోయాయి. దీనిపై సాక్షిలో 'ఆరని తడి.. అన్నదాత కంట తడి' అనే శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి అమరావతిలోని సీఎంఓ కార్యాలయం స్పందించి జిల్లాలో పరిస్థితిపై ఆరా తీసింది. కలెక్టర్‌కు సమాచారం రావడంతో ఆయన వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సూచనలు చేశారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి త్రినాథస్వామి ఆదేశాల మేరకు నరసన్నపేట వ్యవసాయాధికారి సునీత పొలంలో ఉన్న వరి కుప్పలను శనివారం పరిశీలించారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపామని చెప్పారు.

సుడా గ్రీవెన్స్‌సెల్ రేపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్నా పరిష్కరించేందుకు ఈ నెల 6న గ్రీవెన్స్‌సెల్ నిర్వహిస్తున్నట్లు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ లేఔట్లు వేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. సుడా కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10 నుంచి 8639666590 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య వివరించవచ్చని తెలిపారు.

దాతల హాజరు సాధ్యమేనా?

- రశీదులతో రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- లేకపోతే రథసప్తమి పాస్‌లు లేనట్లే!



అరసవల్లి:

ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ సన్నిధిలో రథసప్తమి పర్వదినం వేళ డోనర్ పాసులకు కొత్త నిబంధనలు విధించారు. మునుపెన్నడూ లేనివిధంగా దాతలు రశీదులు పట్టుకుని స్వయంగా హాజరై రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రకటించారు. దీంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. దాతలంటే గౌరవంతో వారికి వారి కుటుంబ సభ్యులు (గరిష్టంగా నలుగురు) రథసప్తమి వంటి పర్వదినాల్లో విశిష్ట దర్శనం చేసుకునేలా గత కొన్నేళ్ల నుంచి డోనర్ పాసులు (దాతల కోసం) విధానం అమల్లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే ముందెన్నడూ లేని విధంగా మళ్లీ రిజిస్ట్రేషన్ చేసుకుని..రశీదులతో హాజరుకావడం చాలా వరకు సాధ్యపడదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 1999 నుంచి దాతల ప్రోత్సాహం అరసవల్లి ఆలయంలో పెరుగుతూ వస్తోంది. రాజకీయ ప్రముఖులు, వ్యాపార సంస్థల యజమానులు, మీడియా పెద్దలు, సినీనటులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు ఇక్కడ ఆలయానికి దాతలుగా ఉన్నారు. 2004 నుంచి ప్రతి రథసప్తమికి ముందు నెలల్లో సుమారు 40 నుంచి 60 మంది వరకు దాతలు తమ విరాళాలను రూ.లక్ష లేదా అంతకుమించి విరాళాలుగా అందజేస్తూ వస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏకంగా రూ.1.56 కోట్లతో మొత్తం 112 మంది దాతలు బంగారు మకరతోరణమే చేయించారు. దీంతో దాతల సంఖ్య ఇప్పటివరకు వెయ్యి దాటేసింది. తాజాగా ఆలయ అధికారులు నిర్ణయించిన రీ రిజిస్ట్రేషన్ విధానంతో కొత్త సమస్యలు తలెత్తే ప్రమాదముందనే చర్చ జోరందుకుంది. ఇంటి పెద్దల పేర్లతో విరాళాలు ఇచ్చిన వారు, అలాగే రశీదులను కోల్పోయిన వారి సంగతేంటో అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న దాతలకు అసలు కనీస సమాచారం కూడా అందించని పరిస్థితులున్న నేపథ్యంలో ఆయా దాతలు, వారి కుటుంబసభ్యులు ఇక్కడికి వచ్చే పరిస్థితులు లేవు. ఒకవేళ వస్తే రీరిజిస్ట్రేషన్‌కు ఒకసారి, మళ్లీ రథసప్తమి దర్శనానికి దాతల పాసులను తీసుకునేందుకు మరోసారి అరసవల్లి రావడం అనేది సాధ్యమయ్యే పనిలా కనిపించడం లేదనే చర్చ జరుగుతోంది. ఇక, రూ.లక్ష కంటే తక్కువ విలువైన విరాళాలిచ్చిన వారి పేర్లను పాసుల విషయంలో తొలగించాలనే వాదనలూ వినిపిస్తున్నాయి. అయితే 2000కి పూర్వం రూ.50 వేలతో నిర్మాణం లేదా విరాళమిస్తే..ఇప్పుడు వాటి విలువ దాదాపుగా రూ.లక్షకు మించుతుందనే లెక్కలున్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఆలయ అధికారులు పక్కా ప్రణాళికతో దాతల పాసులను స్థిరంగా ఉండేలా తగిన చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

క్యూఆర్ కోడ్‌తో డోనర్‌పాస్



అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో దాతల ప్రోత్సాహంతోనే విలువైన వస్తు సామగ్రి, ఆభరణాలతో పాటు భవనాల నిర్మాణాలు జరిగాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని దాతలకు గౌరవంగా దర్శనాలు జరిగేలా చర్యలు చేపడుతున్నామని ఆలయ ఈవో వై.భద్రాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయానికి గతం నుంచి నేటి వరకు దాతలు వందలాది మంది ఉన్నారని.. రానున్న రథసప్తమి పర్వదినాన విశిష్ట దర్శనం కోసం క్యూఆర్ కోడ్‌తో కూడిన డోనర్ పాసులను అందజేస్తామని ప్రకటించారు. ఇందుకోసం ఆలయానికి వివిధ రకాలుగా విరాళాలు ఇచ్చిన దాతలంతా తమ ఆధార్ కార్డులతో పాటు విరాళాల రశీదులను దేవాలయ కార్యాలయం వద్ద ఈ నెల 10లోగా అందజేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన కోరారు.

అరకూరగా వడ్డింపు!



రెండు కేజీల బంగాళదుంప కూర ఎంత మందికి సరిపోతుంది? మహా అయితే ఇరవై మందికి. అయితే అక్షయపాత్ర సంస్థ నిర్వాహకులు మాత్రం అదే కూరను 120 మంది విద్యార్థులకు పంపించారు. గార మండలం అంపోలు పంచాయతీ లింగాలవలస ప్రాథమికోన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు వడ్డించేందుకు శనివారం రెండు కేజీల బంగాళదుంప కూర మాత్రమే పంపించడంతో నిర్వాహకులు తలలు పట్టుకున్నారు. కొద్ది మందికే కూర దక్కగా, మిగిలిన వారంతా సాంబారు అన్నంతోనే సరిపెట్టుకున్నారు. తక్కువ కూర రావడంతో నిర్వాహకులు సీఆర్‌ఎంటీ రాములమ్మకు సమాచారమందించారు.

– గార

ఆరోగ్యశ్రీ స్కీమ్‌ను స్కామ్ చేయనున్నారు

- మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



కాశీబుగ్గ: పేద ప్రజలకు సంజీవనిగా నిలిచిన ఆరోగ్యశ్రీ పథకం ఇకపై ప్రైవేటు పరం చేయనున్నారని, స్కీమ్‌ను స్కామ్ చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధమైందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని దేశమంతా కొనియాడిందని, అలాంటి పథకం ఇప్పుడు దేశవ్యాప్తంగా ఆయుష్మాన్ భారత్‌గా సేవలు అందిస్తోందని చెప్పారు. ఇప్పుడు ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం స్కామ్ చేయడానికి విధి విధానాలను మార్చుకుంటూ వచ్చిందని అన్నారు. ట్రస్ట్ పరిధిలో ఉన్న ఆరోగ్యశ్రీని ప్రైవేటు ఇన్స్యూరెన్సు కంపెనీల చేతుల్లో పెడుతోందన్నారు. ఆ కంపెనీలు కూడా వారి అనుయాయులవేనని, ఆ డబ్బంతా తిరిగి చంద్రబాబు చేబులోకి చేరేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని అన్నారు. ఈ విధానంతో ప్రజలకు మంచి జరగబోదని తెలిపారు. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో రూ.13,421 కోట్లు చెల్లించిందని అందులో రూ.780 కోట్లు కోవిడ్ సేవలకు ఉపయోగించారని గుర్తు చేశారు. మిగిలిన రూ.12,671 కోట్లలో సుమారుగా ఏడాదికి రూ.2,535 కోట్ల చెల్లింపులు జరిగాయని అన్నారు. అది కూడా రూ.5లక్షల ఆదాయంలో ఉన్నవారికి 1.43 లక్షల కుటుంబాలకు సేవలు అందాయని అన్నారు. రూ.25 లక్షల వరకూ వైద్య సేవలు, హైదరాబాద్, చెన్నై, బెంగళూర్‌లో 72 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో సైతం అవకాశం కల్పించామని అన్నారు. ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇప్పుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 1.43 లక్షల కుటుంబాలకు రూ.రెండున్నర లక్షలు సేవలు అందుతాయని అన్నారని, అవికూడా ఏడాదికి రూ.2500లు ప్రీమియం కడితే రాష్ట్ర వ్యాప్తంగా రూ.3571 కోట్ల నిధులతో సేవలు అందిస్తామని అంటున్నారని అన్నారు. అంటే అదనంగా ఏడాదికి రూ.1040 కోట్లు ఖర్చు చేస్తున్నారని అవి ఎక్కడికి చేర్చడానికో చెప్పాలన్నారు. ఏ ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తారో వెల్లడించాలని అన్నారు. అది సత్యకుమార్‌దా, మంగళగిరి కంపెనీలదా చెప్పాలన్నారు.

బడ్జెట్ మీద లోడ్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని, అన్నీ లెక్కలేస్తే సుమారు రూ.5800 కోట్లు తేడా వస్తుందని ఈ అదనం ఎవరికి ఇస్తున్నారని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బొమ్మ కనిపిస్తోంది తప్ప అంతా మంగళగిరి నుంచి ఆపరేటింగ్ జరుగుతోందని అన్నారు. పవన్ కల్యాణ్ ఈ విషయంపై చంద్రబాబును ప్రశ్నించాలన్నారు. గతంలో స్కిల్‌డెవలప్‌మెంట్ స్కీమ్ స్కామ్ చేసినట్లు మళ్లీ సిద్ధమయ్యారని అన్నారు. హైబ్రీడ్ మోడల్ ఆరోగ్యశ్రీ ప్రైవేటు పరం చేయడానికి తప్ప ప్రజలకు, ప్రభుత్వానికి ఉపయోగం లేదన్నారు. వైఎస్ జగన్ హయాంలో వైద్యవ్యవస్థను పటిష్టం చేశారని, ఇప్పుడు అన్నీ ప్రైవేటు పరం చేస్తున్నారని అన్నారు. ఆరు నెలల్లో ఆరోగ్యశ్రీలో 3వేల బిల్లులు పెండింగ్ చేశారని ఈనెల 16 నుంచి సేవలు నిలిచిపోనున్నాయని అన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల అప్‌లోడ్‌కు సాయం


ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగులు పింఛన్ కోసం ఏటా అందజేయాల్సిన లైఫ్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేసేందుకు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల సంఘం ప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి ఆన్‌లైన్‌లో సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేస్తున్నట్లు సంఘం అధ్యక్ష కార్యదర్శులు రోణంకి రామచంద్రరావు, అంకం ధర్మారావు, ఎస్.వి.రమణ, పి.శాంతారాం, దొంతం పార్వతీశం తెలిపారు. ఫిబ్రవరి 28 వరకు కార్యక్రమం కొనసాగిస్తామని చెప్పారు. ఈ నెల 21 నుంచి 28 వరకు శ్రీకాకుళం ఎన్జీవో హోమ్‌లో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమం జరుగుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధార్, పీపీవో, బ్యాంకు ఖాతా, బ్రాంచి, ఫోన్ నంబర్లను తీసుకురావాలని, పూర్తి వివరాలకు 8341275557, 8555919837 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

7 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ


ఎన్.కృష్ణమూర్తి, ఎస్ఈ

అరసవల్లి: ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి వార్షికాదాయ అవసరాలు, రిటైల్ ధరలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జిల్లాలో ఈ నెల 7, 8, 10వ తేదీల్లో డివిజన్ కార్యాలయాల్లో హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తున్నట్లు విద్యుత్ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి శనివారం తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీకాకుళం సర్కిల్, డివిజనల్ కార్యాలయంతో పాటు టెక్కలి, పలాస డివిజన్ ఈఈ కార్యాలయాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని వివరించారు. అభ్యంతరాలను కూడా నమోదు చేస్తామని ప్రకటించారు.

రైళ్లలో గొలుసు దొంగతనాలు

- డిగ్రీ విద్యార్థిని అరెస్టు చేసిన రైల్వే పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ : రైళ్లలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న డిగ్రీ విద్యార్థిని అరెస్ట్ చేసి విశాఖ కోర్టుకు తరలిస్తున్నట్లు విశాఖపట్నం జీఆర్‌పీ లైన్స్ సీఐ రవికుమార్ తెలిపారు. పలాస రైల్వేస్టేషన్‌లో శనివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. కోటబొమ్మాళి మండలం చిన్నహరిశ్చంద్రపురం గ్రామానికి చెందిన ఈరగట్టపు రాము నరసన్నపేటలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో బీకాం కంప్యూటర్స్ తృతీయ సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. దురలవాట్లకు బానిసయ్యాడు. డబ్బు కోసం దొంగతనాలకు అలవాటు పడ్డాడు. పలాస నుంచి విశాఖ వెళ్లే రైళ్లలో ఒంటరిగా వెళ్తున్న మహిళలను టార్గెట్ చేస్తూ వారి వద్ద బంగారు గొలుసులను అపహరిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ విద్యార్థిపై గతంలో పోలాకి పోలీసుస్టేషన్ పరిధిలో వైన్ షాప్ దొంగతనం కేసు కూడా ఉంది. పలాస జీఆర్‌పీ స్టేషన్ పరిధిలో మూడు కేసులకు సంబంధించి 35 గ్రాముల బంగారు పుస్తెలతాడు, 35 గ్రాముల మంగళసూత్రం, 3 తులాల మంగళ సూత్రం చోరీకి గురికాగా.. ఇందులో రెండు వస్తువులు రికవరీ చేశారు. 35 గ్రాముల మంగళసూత్రం రికవరీ చేయాల్సి ఉందని సీఐ తెలిపారు.

చిరుద్యోగుల పొట్టకొట్టడం తగదు

- వైఎస్సార్ సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: చిరుద్యోగుల పొట్టకొట్టేలా ఎమ్మెల్యే కూన రవికుమార్ కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుటుంబ పోషణ కోసం చిన్నపాటి ఉద్యోగాలు చేస్తున్న వారిని తొలగించి కొత్త వారిని నియమించడం తగదన్నారు. వైఎస్సార్ సీపీకి ఓటు వేశారన్న నెపంతో ఇప్పటికే విధుల నుంచి తొలగించిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ నిర్మూలనకు నియోజకవర్గంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తే పార్టీ తరఫున మద్దతు ఇస్తామని తెలిపారు. అకారణంగా చిరుద్యోగులను తొలగిస్తే వారి తరఫున న్యాయపోరాటం చేస్తామన్నారు. టీడీపీ నేతలు కక్ష సాధింపు చర్యలు వీడకపోతే మూల్యం చెల్లించకతప్పదన్నారు. రాజకీయ కక్షతో పింఛన్లు తొలగిస్తున్నారని, తప్పులు చేయకున్నా వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఎస్సీ ఎస్టీ అక్రమ కేసులను బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఇసుక అక్రమరవాణా, లిక్కర్ షాప్‌లనుంచి కమీషన్‌లు, వ్యాపారుల వద్ద దందాలు, పొందూరులో మైనింగ్ వ్యాపారులపై జులుం చూపించడం వంటి పనులన్నీ నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. సర్పంచ్‌లు హక్కులు కాలరాస్తూ చెక్ పవర్ రద్దు చేయడమేంటని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అన్ని పరిణామాలకు కూన రవికుమారే బాధ్యుడని, ఎవరికి ఎటువంటి హాని జరిగినే ఆయన బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్‌లీడర్ బొడ్డేపల్లి రమేష్‌కుమార్, నాయకులు బొడ్డేపల్లి పద్మజ, సరుబుజ్జిలి జెడ్పీటీసీ సురవరపు నాగేశ్వరరావు, బూర్జ మండల పార్టీ అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు, సరుబుజ్జిలి మండల పార్టీ అధ్యక్షుడు బెవర మల్లేశ్వరరావు, ఆమదాలవలస పట్టణ పార్టీ అధ్యక్షుడు పొడుగు శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, గుమ్మడి రాంబాబు, బల్లి రామారావు, దుంపల శ్యామలరావు, జిల్లా మేధావుల విభాగం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం


బారువ జూనియర్ కాలేజీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ అశోక్

సోంపేట: మండలంలోని బారువ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ శనివారం ప్రారంభించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు. అనంతరం పలాసపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తండ్రి ద్వారా పారాకత్తులతో సంక్రమించే వారసత్వ భూములకు కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, కేవలం పారాకత్తులు రాసి ఇస్తే రికార్డుల్లో నమోదు చేయడం కుదరదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్, పలాస ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ అప్పలస్వామి, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూరాడ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని నగరంపల్లి గ్రామానికి చెందిన దుబ్బ చంద్రయ్య(53) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంద్రయ్య రోజువారి కూలీ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు చెప్పడంతో వారికి అడ్డు చెబుతూ శుక్రవారం రాత్రి ఎప్పటిలాగే తన గదిలోకి వెళ్లిపోయాడు. కుమారుడు తేజేశ్వర్, కోడలు వేరే గదిలో నిద్రపోయారు. భార్య శ్రీదేవి పలాసలోని పుట్టింట్లో ఉంది. శనివారం ఉదయం ఎంతసేపటికీ చంద్రయ్య గది తెరవకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు తెరిచారు. ఫ్యాన్‌కు చంద్రయ్య మృతదేహం వేలాడుతూ కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జిన్నారావు తెలిపారు.

ఉప్పుగెడ్డలో పడి వృద్ధురాలి మృతి


వృద్ధురాలి మృతదేహం

గార: మండలంలోని బందరువానిపేట సమీపంలో ఉప్పుగెడ్డలో పడి వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకూర్మం పంచాయతీ జెల్లపేటకు చెందిన గంట్రేటి కృష్ణమ్మ (74) గార వెళ్తానని చెప్పి శుక్రవారం ఇంటి నుంచి బయలుదేరింది. తర్వాత ఆచూకీ లేకుండాపోయింది. బందరువానిపేటలోకి వెళ్లే రోడ్డు కమ్ బ్రిడ్జి నుంచి తోనంగి వైపు ఉన్న గెడ్డలో మత్స్యకారుల వలలకు మృతదేహం చిక్కడంతో శనివారం పోలీసులకు సమాచారమందించారు. ఏఎస్ఐ టి.చంద్రశేఖర్, సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తీయించారు. మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్ తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఆర్.జనార్ధన్ తెలిపారు.

క్వారీ నిర్వహణతో ఇబ్బందులు


ఖాసింఖాన్ గ్రానైట్ క్వారీపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్న మైన్స్ అధికారులు

టెక్కలి: గ్రామానికి ఆనుకుని క్వారీ నిర్వహణతో గ్రామస్తులమంతా అనేక ఇబ్బందులు పడుతున్నామని సన్యాసినీలాపురం వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఖాసింఖాన్ గ్రానైట్ క్వారీపై గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రెండు రోజుల కిందట మైనింగ్ అధికారులు గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. గ్రామానికి ఆనుకుని క్వారీ నిర్వహిస్తుండడం వల్ల గతంలో ఎలాంటి ఇబ్బందులు లేకపోయినప్పటికీ ప్రస్తుతం బ్లాస్టింగ్‌లు చేయడంతో రాళ్లు ఇళ్లపై పడి భయాందోళన కలిగిస్తున్నాయని, అలాగే రాత్రి వేళల్లో ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నామని విచారణలో అధికారులకు వివరించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలను అధికారులు నమోదు చేశారు. దీనిపై మైన్స్ ఏడీ విజయలక్ష్మి వద్ద ప్రస్తావించగా గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కింది స్థాయి సిబ్బంది విచారణ చేశారని పూర్తి వివరాలతో అధికారులకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు


మహిళా అభ్యర్థుల రన్నింగ్


అభ్యర్థుల ఎత్తు పరిశీలిస్తున్న ఎస్పీ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఆర్మ్‌డు రిజర్వు మైదానంలో పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా మహిళా అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు శనివారంతో ముగిశాయి. రెండు రోజుల్లో 1175 మందిని పిలవగా 647 మంది హాజరయ్యారు. 247 మంది తుదిరాత పరీక్షకు ఎంపికయ్యారు. సోమవారం నుంచి 18వ తేదీ వరకు ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా పురుష అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. 1600, 100 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్ ఈవెంట్లు నిర్వహిస్తున్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.